క్లుప్తంగా

ప్రణాళికతో సిద్ధమైతే పోటీ పరీక్షల్లో విజయం



నెహ్రూనగర్: పోటీ పరీక్షలకు అభ్యర్థులు ప్రణాళిక ప్రకారం సిద్ధమైతే విజయం సాధించవచ్చని ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు పేర్కొన్నారు. రాజాగారితోటలోని ఏపీ బీసీ స్టడీ సర్కిల్‌లో గ్రూప్ 2 మెయిన్స్ పరీక్షకు ఉచిత శిక్షణకు హాజరవుతున్న అభ్యర్థులకు బి. మల్లికార్జునరావు(రిటైర్డ్ హిస్టరీ లెక్చరర్) తయారు చేసిన 'ఆంధ్రప్రదేశ్ చరిత్ర' స్టడీ మెటీరియల్ ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిర్దేశిత సిలబస్ చదివాక, ఆయా సబ్జెక్టులకు సంబంధించిన తెలుగు అకాడమీ ఇతర ప్రామాణిక పుస్తకాలను కూడా చదవాలన్నారు. ఈ కార్యక్రమంలో స్టడీ సర్కిల్ డైరెక్టర్ డి. మధుసూదనరావు, హిస్టరీ ఫ్యాకల్టీ రఫీ పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

గుంటూరు ఈస్ట్: ఆత్మహత్యాయత్నం చేసిన ఓ వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటనపై నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీరామ్‌నగర్‌కు చెందిన వెంకట నరసింహారావు (38) చెడు వ్యసనాలకు బానిసయ్యాడు. మానసికంగా కుంగిపోయి గత నెల 31న గడ్డిమందు తాగాడు. జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

టీజేపీఎస్ కళాశాలలో హెల్ప్‌డెస్క్

గుంటూరు ఎడ్యుకేషన్: పట్టాభిపురంలోని టీజేపీఎస్ కళాశాలలో డిగ్రీ, పీజీ కోర్సులకు సంబంధించిన హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేసినట్లు కళాశాల కరస్పాండెంట్ కేవీ బ్రహ్మం శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. విద్యార్థులకు సలహాలు, సూచనలు ఇవ్వడంతోపాటు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు దాఖలు, ఆప్షన్ల నమోదుకు సంబంధించిన సేవలను అందజేస్తామని పేర్కొన్నారు. వివిధ కోర్సుల్లో స్పాట్ అడ్మిషన్లు సైతం నిర్వహిస్తున్నామని చెప్పారు. డిగ్రీ తరువాత ఉద్యోగావకాశాల కల్పనపై కెరీర్ గైడెన్స్ ఇస్తామని తెలిపారు.

ఐఎస్‌సీ డైరెక్టర్‌గా పద్మావతి బాధ్యతల స్వీకరణ



ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ ఇంటర్నేషనల్ స్టూడెంట్ సెల్ (ఐఎస్‌సీ) ఇన్‌చార్జి డైరెక్టర్‌గా జువాలజీ విభాగ ఆచార్యురాలు పి. పద్మావతి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. పూర్వ డైరెక్టర్ ప్రొఫెసర్ జి. చెన్నారెడ్డి ఆమెకు బాధ్యతలు అప్పగించారు. రిజిస్ట్రార్ ఆచార్య జి. సింహాచలం, ఆర్ట్స్, సైన్స్ కళాశాలల ప్రిన్సిపల్స్ ఆచార్య సీహెచ్ స్వరూపారాణి, ఆచార్య కె. వీరయ్య, యూనివర్సిటీ అడ్మిషన్ల డైరెక్టర్ డాక్టర్ పి. బ్రహ్మజీరావు, దూరవిద్యా కేంద్రం పరీక్షల కోఆర్డినేటర్ ఆచార్య డి. రామచంద్రన్, సోషల్ సైన్సెస్ డీన్ ఆచార్య ఎం. త్రిమూర్తిరావు తదితరులు నూతన డైరెక్టర్‌కు పుష్పగుచ్ఛాలు అందించి అభినందనలు తెలిపారు. విదేశాల నుంచి ఏఎన్‌యూలో పలు కోర్సులు చదివే విద్యార్థులకు ఈ సెల్ ద్వారా ప్రత్యేక సేవలు అందించేందుకు చర్యలు చేపడతానని ఈ సందర్భంగా నూతన డైరెక్టర్ తెలిపారు.

పింగళి వెంకయ్యకు ఘన నివాళి

లక్ష్మీపురం: జాతీయ పతాకానికి రూపకల్పన చేసిన పింగళి వెంకయ్య ఆంధ్రుడు కావడం తెలుగు వారందరికీ గర్వకారణమని అవగాహన సంస్థ సభ్యులు పేర్కొన్నారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో శుక్రవారం పింగళి వెంకయ్య జయంతి కార్యక్రమం నిర్వహించారు. పింగళి వెంకయ్య చిత్రపటానికి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో సీనియర్ ఇంజినీర్ ఘనశ్యామాచార్యులు మాట్లాడుతూ త్రివర్ణ పతాక రూపకర్తగా ఆంధ్రప్రదేశ్ వాసి పింగళి వెంకయ్య ప్రజల గుండెల్లో నిలిచిపోయారన్నారు. కృష్ణా జిల్లాకు పింగళి వెంకయ్య పేరు పెట్టాలని అవగాహన సంస్థ సభ్యులు కోరారు. జయంతిని అధికారికంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కొండా శివరామిరెడ్డి, భాస్కరరావు, వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

మాలలను మోసగించిన సీఎం చంద్రబాబు

నెహ్రూనగర్: ఎస్సీ వర్గీకరణ విషయంలో ప్రధాని నరేంద్ర మోదీ, సీఎం చంద్రబాబు నాయుడు మోసం చేశారని జాతీయ మాల మహానాడు అధ్యక్షులు ఈమని చంద్రశేఖర్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. వర్గీకరణ విషయంలో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు వెనుక వీరి కుట్ర దాగి ఉందని పేర్కొన్నారు. ఆర్టికల్ 341 ప్రకారం వర్గీకరణ చెల్లదని గుర్తుచేశారు. సుప్రీంకోర్టు మాత్రం రాష్ట్రాలకు వర్గీకరణ అధికారం ఇవ్వడం సమంజసం కాదన్నారు.

పారిశుద్ధ్యంపై ప్రధానంగా దృష్టి అవసరం



కాలువను పరిశీలించి అధికారులకు సూచనలు చేస్తున్న నగర కమిషనర్ హరికృష్ణ



కమిషనర్‌కు తమ సమస్యలు వివరిస్తున్న ఉద్యోగులు

- డ్రైనేజీల్లో పూడికతీతకు చర్యలు
- నగర కమిషనర్ హరికృష్ణ ఆదేశం
- పలు ప్రాంతాల్లో నిర్వహణపై పరిశీలన

నెహ్రూనగర్ : నగరంలో పారిశుద్ధ్యంపై ప్రధానంగా దృష్టి సారించాలని నగర కమిషనర్ (ఎఫ్ఏసీ) ఎస్.హరికృష్ణ పేర్కొన్నారు. డ్రైనేజీలో మురుగునీరు నిల్వకుండా పక్కాగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎక్కడైనా వ్యర్థాలు ఉంటే సదరు కాంట్రాక్టరే తీసేలా ఇంజినీరింగ్ అధికారులు సమన్వయం చేసుకోవాలని సూచించారు. శుక్రవారం కమిషనర్ ఇంజినీరింగ్, ప్రజారోగ్య అధికారులతో కలిసి లక్ష్మీపురం, జీటీ రోడ్, సంపత్‌నగర్, నల్లచెరువు ప్రాంతాల్లో పర్యటించారు. నగరానికి ప్రధానంగా డ్రైనేజీ నీరు వెళ్లే పీకలవాగును పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. ప్రధాన డ్రైనేజీలలో మురుగునీరు, వ్యర్థాలు నిల్వ ఉండకుండా చూడాలన్నారు. తద్వారా వర్షపు నీరు ఆగకుండా వెళ్తుందన్నారు. ఈ మేరకు ఇంజినీరింగ్, ప్రజారోగ్య శాఖ అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు. ఎక్కడైనా పూడిక ఉంటే, కాంట్రాక్టరే తొలగించేలా ఇంజినీరింగ్ అధికారులు చూడాలన్నారు. తొలగించిన పూడికను వెంటనే తరలించాలని, లేకుంటే వర్షాలకు మళ్లీ డ్రైనేజీలలోనే పడుతుందని పేర్కొన్నారు. పెద్ద కాలువల్లో కలిసే చోట చిన్న డ్రైనేజీలకు అడ్డుగా ఇనుప జాలీలు ఏర్పాటు చేస్తే చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలు కిందికి రాకుండా అడ్డుకోవచ్చన్నారు. పారిశుద్ధ్య పనులు సమగ్రంగా చేపట్టడంపై ప్రజారోగ్య అధికారులు శ్రద్ధ చూపాలని సూచించారు. ఇంటింటి నుంచి చెత్త సేకరణ నూరు శాతం జరగాలని ఎంహెచ్ఓను ఆదేశించారు. కొన్ని ప్రాంతాల్లో చెట్ల కొమ్మలు రోడ్ల పక్కన ఉంటున్నాయని, విద్యుత్ శాఖ అధికారులు లైన్ వెంట కొమ్మలు తొలగించేటప్పుడు తప్పనిసరిగా ఈ కొమ్మలను కూడా తొలగించేలా చర్యలు తీసుకోవాలని ఎస్ఈని ఆదేశించారు. కార్యక్రమంలో ఎస్ఈ ఎం.శ్యాం సుందర్, ఎంహెచ్ఓ మధుసూదన్, ఈఈ సుందర్రామి రెడ్డి, డీఈఈ రమేష్ బాబు, ఏఈలు రాంబాబు, శ్రీకాంత్, సచివాలయ ఎమినిటీ కార్యదర్శులు పాల్గొన్నారు.

కార్యాలయంలో పరిశుభ్రత ముఖ్యం

గుంటూరు నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయం పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని హరికృష్ణ ఆదేశించారు. శుక్రవారం ఎంహెచ్ఓ మధుసూదన్, మేనేజర్ ప్రసాద్‌లతో కలిసి ఈ కార్యాలయాన్ని ఆయన పరిశీలించారు. అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ జీఎంసీ ప్రధాన కార్యాలయాన్ని శుభ్రంగా ఉంచాలని సూచించారు. వినియోగంలో లేని బీరువాలు, ఇతర సామగ్రిని తొలగించాలని పేర్కొన్నారు. వ్యర్థాలను ఆఫీస్ పరిసరాల్లో వేయకుండా డస్ట్ బిన్‌లను ఏర్పాటు చేయాలన్నారు. ప్రతి విభాగంలో సిబ్బంది డస్ట్ బిన్లను వినియోగించాలని సూచించారు. కార్యాలయ పరిసరాల్లో పచ్చదనం పెంపుకు ప్రత్యేక దృష్టి సారించాలని ఏడీహెచ్‌ను ఆదేశించారు.

ఉద్యోగుల సంక్షేమానికి పెద్దపీట

నెహ్రూనగర్: నగరపాలక సంస్థ ఉద్యోగుల సంక్షేమానికి తగిన కృషి చేయాలని ఏపీ మున్సిపల్ కార్పొరేషన్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ సమ్రత్‌కుమార్ కోరారు. హరికృష్ణను మినిస్టీరియల్ ఎంప్లాయిస్ శుక్రవారం ఆయన ఛాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా హరికృష్ణ మాట్లాడుతూ.. వివిధ కారణాలతో సస్పెన్షన్‌కు గురైన ఉద్యోగులను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని కోరారు. అనంతరం పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటానని కమిషనర్ హరికృష్ణ చెప్పారు. సాదిక్ పాషా, హజార్ వెంకటేశ్వర్లు, జ్యోతిర్మయి, బి.మల్లేశ్వరి, రేణుక దుర్గభవాని, మానస, లక్ష్మి, ఇతర ఉద్యోగులు పాల్గొన్నారు.

అనుచిత వ్యాఖ్యలు చేయకుండా చూడాలి

గుంటూరు మెడికల్ ఏఎన్ఎంలపై అధికారులు అనుచిత వ్యాఖ్యలు చేయకుండా చూడాలని కలెక్టర్ నాగలక్ష్మిని ఏపీఎన్‌జీఓ నేతలు కోరారు. ఏపీఎన్‌జీఓ గుంటూరు జిల్లా అధ్యక్షుడు ఘంటసాల శ్రీనివాసరావు, కార్యదర్శి శెట్టిపల్లి సతీష్ కుమార్‌లు శుక్రవారం జిల్లా కలెక్టర్ నాగలక్ష్మిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవల ఏఎన్ఎంలను ఉద్దేశించి ఒక ఎంపీడీవో చేసిన వ్యాఖ్యలు అనుచితమని ఫిర్యాదు చేశారు. ఏఎన్ఎంలు నిత్యం పలు యాప్‌లతో పాటు వివిధ వైద్య సేవలు అందిస్తున్నారని గుర్తుచేశారు. వారిపై ఇలాంటి వ్యాఖ్యలు చేయడం తగదని పేర్కొన్నారు. గతంలో మెడికల్ అండ్ హెల్త్ కమిషనర్ కూడా ఏఎన్ఎంలకు ఇతర డ్యూటీలు వేయవద్దని ఉత్తర్వు ఇచ్చారని గుర్తుచేశారు. అయినా పెన్షన్లు పంపిణీకి వారి సేవలను వినియోగిస్తున్నారని వెల్లడించారు. వారు వేకువజామున ఈ పంపిణీ కార్యక్రమానికి హాజరవ్వటం ఇబ్బందికరమని తెలిపారు. దీనిపై కలెక్టర్ స్పందిస్తూ ఇకపై ఇలాంటి వ్యాఖ్యలు చేయకుండా అధికారులకు తగు సూచనలు ఇస్తానని తెలిపినట్లు యూనియన్ నేతలు వెల్లడించారు. వినతి పత్రం అందజేసిన వారిలో యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్. వెంకటరెడ్డి, నగర అధ్యక్షుడు ఎస్.పి.ఎస్. సూరి, కోశాధికారి విజయబాబు, ఉపాధ్యక్షుడు ఎం. శ్రీనివాసరావు, ప్రత్తిపాడు తాలూకా అధ్యక్షులు సీహెచ్ అనిల్ కుమార్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి ఆర్డీకి వినతి



డాక్టర్ సుచిత్రను కలిసిన నేతలు

గుంటూరు మెడికల్: మెడికల్ అండ్ హెల్త్ రీజినల్ డైరెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన డాక్టర్ సుచిత్రను ఏపీ హంస అసోసియేషన్ గుంటూరు జిల్లా , గుంటూరు సిటీ యూనిట్ ప్రతినిధులు శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ.. వైద్యశాఖలో పనిచేస్తున్న ఉద్యోగులకు త్వరగా ప్రమోషన్‌లు ఇవ్వాలని కోరారు. జీవో 143 ద్వారా సర్దుబాటు చేసిన వారి జీతాల సమస్యల పరిష్కారానికి చొరవ తీసుకోవాలన్నారు. అందరికీ న్యాయం చేకూరేలా చర్యలు తీసుకోవాలని కోరారు. తర్వాత జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ కొర్రా విజయలక్ష్మిని కలిశారు. రెగ్యులర్ అయిన కొంత మంది ఎంపీహెచ్ఏ సిబ్బందికి జీతాల సమస్య ఉందని చెప్పారు. దానిని పరిష్కరించాలని నేతలు కోరారు. రెండేళ్ల పాటు ట్రైనింగ్ పూర్తి చేసుకున్న ఏఎన్ఎంలను వెంటనే ఆయా ఆరోగ్య కేంద్రాల్లో సర్దుబాటు చేయాలన్నారు. కార్యక్రమంలో హంస జిల్లా ప్రెసిడెంట్ బి.నాగవర్ధన్, స్టేట్ వైస్ ప్రెసిడెంట్ బి.కిరణ్, జిల్లా కోశాధికారి బి. వెంకటప్పయ్య, సిటీ ప్రెసిడెంట్ నరేంద్ర, జిల్లా వైస్ ప్రెసిడెంట్ షరీఫ్ మహమ్మద్, సిటీ కార్యదర్శి శ్రీనివాసరావు, అంజిరెడ్డి, జిల్లా మహిళా సెక్రెటరీ ఝాన్సీరాణి, ప్రశాంతి, ఆశాలత, రాజ్యలక్ష్మి, కె.పద్మ, ఇందిర, జయకర్, నరసింహారావు, ఫెన్నీ, ప్రసాదరావు, శ్రీనివాసరావు, దొలా తదితరులు పాల్గొన్నారు.

వ్యాధి నిరోధక టీకాల ప్రతికూలతలపై సమీక్ష



సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ డాక్టర్ విజయలక్ష్మి

గుంటూరు మెడికల్ : వ్యాధి నిరోధక టీకాల అనంతరం సంభవించే ప్రతికూల ప్రభావాలపై డీఎంహెచ్ఓ డాక్టర్ కొర్రా విజయలక్ష్మి శుక్రవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఏఈఎఫ్ఐ కేసులు రాకుండా తీసుకోవలసిన జాగ్రత్తలపై కమిటీ సభ్యులతో తన చాంబరులో చర్చించారు. అనుమానాస్పద కేసులు నమోదైతే వెంటనే వైద్యాధికారి దృష్టికి తీసుకొని వెళ్లి తగిన చర్యలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు డాక్టర్ కె.వి.సుబ్బరాజు, జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ బి.దేవకుమార్, హెచ్ఓడీ పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ జి. భవాని, సర్వైలెన్స్ మెడికల్ ఆఫీసర్ డబ్ల్యూహెచ్ఓ డాక్టర్ ఎం.రమేష్ బాబు, డాక్టర్ బి.శివగోపాల్, డాక్టర్ టి.భారత్, అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్. హర్షద్ యాదవ్, డాక్టర్ ఎస్. వసుంధర, వైద్యాధికారులు పాల్గొన్నారు.

డీఎంహెచ్ఓను కలిసిన బీజేపీ నేతలు

గుంటూరు మెడికల్ : ప్రధాని నరేంద్ర మోదీ ప్రవేశపెట్టిన ఆయుష్మాన్ భారత్ కార్డుల జారీ ప్రక్రియను అందుబాటులోకి తీసుకురావాలని బీజేపీ నేతలు శుక్రవారం డీఎంహెచ్ఓ కొర్రా విజయలక్ష్మిని కలిసి వినతి పత్రం అందజేశారు. ప్రజలకు అందించని కార్డులను తక్షణమే పంపిణీ చేయాలని కోరారు. విజయలక్ష్మి స్పందిస్తూ పరిశీలించి కార్డులను అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. కేవైసీ పెండింగ్‌లో ఉన్న వాటిని గ్రామ, పట్టణ స్థాయిలో సత్వరమే పూర్తి చేస్తామన్నారు. డీఎంహెచ్ఓను కలిసిన వారిలో బీజేపీ తెనాలి అసెంబ్లీ కన్వీనర్ కటారి వాసుదేవ నాయుడు, తెనాలి మండల ప్రెసిడెంట్ కడియాలనంద కిషోర్, వై.కామేశ్వరరావు, కొవ్వూరి శ్రీను తదితరులు ఉన్నారు.

కాంట్రాక్టు అధ్యాపకుల క్రమబద్ధీకరణకు వినతి



పయ్యావుల కేశవ్‌కు వినతి పత్రం సమర్పిస్తున్న ఎమ్మెల్సీ లక్ష్మణరావు

గుంటూరు ఎడ్యుకేషన్ రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ కళాశాలల్లో పని చేస్తున్న ఐదువేల మంది కాంట్రాక్టు అధ్యాపకుల రెగ్యులరైజేషన్ ప్రక్రియ తక్షణం ప్రారంభించాలని ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్‌కు ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు శుక్రవారం వెలగపూడిలోని సచివాలయంలో కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ... రెగ్యులరైజేషన్ చట్టం చేసిన గత వైసీపీ ప్రభుత్వం ఇందుకు జీవో నెంబరు 114 విడుదల చేసిందని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా వివిధ శాఖల్లో 10,117 మంది కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులరైజేషన్ చేసేందుకు అనుమతించగా, ఇప్పటి వరకు మూడువేల మంది క్రమబద్ధీకరణ పూర్తయిందని వివరించారు. వైద్యారోగ్య శాఖలోనే రెగ్యులరైజేషన్ జరగ్గా, మిగిలిన శాఖల్లో ప్రధానంగా విద్యాశాఖలో ఐదు వేల మంది ఎదురు చూస్తున్నారని మంత్రి దృష్టికి తెచ్చినట్లు తెలిపారు. సాంఘిక, బీసీ, గిరిజన సంక్షేమ గురుకులాలతోపాటు ఏపీ రెసిడెన్షియల్ విద్యాసంస్థల్లో పని చేస్తున్న వారి ఉద్యోగ విరమణ వయస్సు 60 నుంచి 62 ఏళ్లకు పెంచాలని కోరారు. మంత్రిని కలిసిన వారిలో పీవీ మల్లేశ్వర్, జీవీవీ సుబ్బారాయుడు ఉన్నారు.

సంక్షేమ బోర్డు పునరుద్ధరణకు విజ్ఞప్తి



తెనాలి ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్‌కు వినతి పత్రం అందిస్తున్న దృశ్యం

లక్ష్మీపురం: ఆంధ్రప్రదేశ్ భవన నిర్మాణ సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని తాడికొండ శాసన సభ్యులు తెనాలి శ్రావణ్ కుమార్‌కు వినతిపత్రం అందించారు. ఆంధ్రప్రదేశ్ భవన నిర్మాణ కార్మిక సంఘం గుంటూరు విభాగం ప్రతినిధులు ఏఐటీయూసీ ఆధ్వర్యంలో శుక్రవారం తాడికొండలో ఎమ్మెల్యేను కలిశారు. జీవో నెంబర్ 17ను రద్దు చేసి బోర్డు పునరుద్ధరించాలని వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షులు పుప్పాల సత్యనారాయణ (బుజ్జి) మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో చంద్రబాబు, పవన్ కళ్యాణ్‌లు బోర్డు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారన్నారు. నిర్మాణ కార్మికులకు మేలు చేసేలా ఉచిత ఇసుక విధానం అమలు అవుతోందన్నారు. సంక్షేమ బోర్డును పునరుద్ధరించి, పెండింగ్‌లోని 42 వేల క్లైములకు నిధులు మంజూరు చేయాలన్నారు. కార్మికులను ఆదుకోవాలని కోరారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్ కుమార్, నగర కార్యదర్శి కోట మాల్యాద్రి, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆకిటి అరుణ్ కుమార్, మేడా హనుమంతరావు, నగర అధ్యక్షులు రావుల అంజిబాబు, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు జంగాల చైతన్య, సీపీఐ నగర నాయకులు నూతలపాటి చిన్న, ఎస్.దేవానాయక్ తదితరులు పాల్గొన్నారు.

జ్వర బాధితుల గుర్తింపునకు సర్వే



స్థానికులను అడిగి వివరాలు తెలుసుకుంటున్న వైద్యులు

తాడేపల్లి రూరల్: దుగ్గిరాల మండల పరిధిలోని తుమ్మపూడి గ్రామంలో జ్వరాలు విజృంభించడంతో బాధితుల గుర్తింపునకు ఇంటింటి సర్వే చేపట్టారు. దుగ్గిరాల పీహెచ్‌సీ ఆధ్వర్యంలో శుక్రవారం ఇంటింటి సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ కేంద్ర వైద్యులు డాక్టర్ అబ్దుల్ రహమాన్ మాట్లాడుతూ... తుమ్మపూడిలో జ్వరాలు అధికంగా ఉండడంతో సర్వే చేశామన్నారు. జ్వరాలు వచ్చిన వారితో పాటు ఇతరులకు కూడా డెంగీ, మలేరియా తదితర పరీక్షలు నిర్వహిస్తున్నామని చెప్పారు. ఇప్పటి వరకు ఒక్క కేసు కూడా కనిపించలేదని పేర్కొన్నారు. స్థానికులు సీజన్ మారడంతో అనారోగ్యం బారిన పడ్డారని తెలిపారు. వారికి ఒళ్లు నొప్పులు అధికంగా ఉండటంతో మందులు అందజేశామని వివరించారు. పరీక్షలు చేయించుకోవాలని భావించేవారు దుగ్గిరాల పీహెచ్‌సీకి రావచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఇందిర, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, ఎంఎల్‌హెచ్‌పీలు, హెల్త్ సూపర్‌వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

హామీలను సీఎం అమలు చేయాలి

లక్ష్మీపురం: ఎన్నికల సమయంలో ఎన్డీయే కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను వెంటనే అమలు చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్ డిమాండ్ చేశారు. కొత్తపేటలోని మల్లయ్యలింగం భవన్ ఆఫీసులో పొన్నూరు నియోజకవర్గ కమిటీ సమావేశం కొల్లి రంగారెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అధికారంలోకి వచ్చాక టీడీపీ నాయకులు కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని మండిపడ్డారు.

పరీక్ష కేంద్రాలలో తనిఖీ



ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం పరిధిలోని మంగళగిరి వీటీజేఎం అండ్ ఐవీటీఆర్ డిగ్రీ కళాశాలతోపాటు పలు పరీక్షా కేంద్రాలను యూనివర్సిటీ డిగ్రీ పరీక్షల కో ఆర్డినేటర్ ఆచార్య ఎన్‌వీ కృష్ణారావు శుక్రవారం తనిఖీ చేశారు.

భవన నిర్మాణం పూర్తి చేయాలని వినతి

గుంటూరు వెస్ట్: బీసీ సంక్షేమ భవన నిర్మాణం పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ నాగలక్ష్మికి ఏపీ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేసన శంకరరావు వినతిపత్రం అందించారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లోని శంకరరావు మాట్లాడుతూ.. 2016లో సీఎంగా ఉన్న చంద్రబాబు అంకిరెడ్డి పాలెం సమీపంలో భవనానికి భూమి కేటాయించారన్నారు. నిర్మాణానికి అనుమతులు మంజూరైనా ఇంతరకు కట్టడం పూర్తి కాలేదని పేర్కొన్నారు. గత ప్రభుత్వం నిర్మాణాన్ని పూర్తిగా పక్కన పెట్టిందన్నారు. ప్రస్తుతం ఎన్‌డీఏ కూటమి అధికారంలో ఉందని, నిర్మాణం వెంటనే పూర్తి చేయాలని కోరారు.

అలరించిన సంకీర్తనామృతం

నగరంపాలెం: స్థానిక బృందావన్ గార్డెన్ శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణం అన్నమయ్య కళావేదికపై శుక్రవారం కమనీయంగా రామబంటు చరితం సంకీర్తన ఆలాపన కార్యక్రమం నిర్వహించారు. బెల్లంకొండ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటైన ఈ కార్యక్రమాన్ని తొలుత ఆలయ అధ్యక్షులు సీహెచ్ మస్తానయ్య, ప్రధాన కార్యదర్శి బొర్రా ఉమామహేశ్వరరావు జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. రమామహేశ్వరి బృందం తిరుమల గిరిరాయ కీర్తనతో కార్యక్రమాన్ని ఆరంభించింది. రామబంటు చరితంలోని పలు కమనీయ సంకీర్తనలను శ్రావ్యంగా ఆలపించింది. వయోలిన్‌పై పి.ఆంజనేయశాస్త్రి, మృదంగంపై జగన్మోహిని వాయిద్య సహకారం అందించారు. డాక్టర్ చింతలపాటి గోపాలకృష్ణ జయంతి సందర్భంగా దేవాలయ సిబ్బందికి వస్త్రాలు పంపిణీ చేశారు.

వైభవంగా స్వామి వారి కల్యాణం



నగరంపాలెం: స్థానిక బ్రాడీపేట 2/7వ అడ్డరోడ్డులోని శ్రీ గౌరీవిశ్వేశ్వరాలయంలో శుక్రవారం స్వామి వారి జన్మ నక్షత్రం పురస్కరించుకుని కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారికి ప్రత్యేక అలంకరణలు, పూజలు చేపట్టారు. అత్తలూరి విశ్వేశ్వరశర్మ, గాయత్రి దంపతులు కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. భక్తులు స్వామి వారిని దర్శించుకుని, తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. మల్లికార్జునశర్మ, కాలనీవాసులు కార్యక్రమాలను పర్యవేక్షించారు.

డ్రైవర్లు బాధ్యతగా వ్యవహరించాలి



సదస్సులో మాట్లాడుతున్న డీటీసీ షేక్ కరీం



హాజరైన డ్రైవర్లు

పట్నంబజారు: బస్సు, లారీ డ్రైవర్‌లు ఎంతో బాధ్యతతో సురక్షితంగా వాహనాలను నడపాలని డీటీసీ షేక్ కరీం చెప్పారు. గుంటూరు నగరంలోని ప్రైవేట్ డ్రైవింగ్ స్కూల్‌లో శిక్షణ పొందుతున్న వారికి స్వర్ణభారతినగర్‌లోని 'సేఫ్టీ డ్రైవింగ్ సెంటర్'లో శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఇందులో భాగంగా పూర్తిస్థాయిలో రహదారి భద్రత నిబంధనలు వివరించారు. ఈ సందర్భంగా డీటీసీ షేక్ కరీం మాట్లాడుతూ.. లారీ డ్రైవర్లు మద్యం తాగి వాహనాలను నడపరాదని సూచించారు. సరైన విశ్రాంతి తీసుకోవాలని కోరారు. ఓవర్ లోడింగ్ ఎంతో ప్రమాదకరమన్న విషయాన్ని గుర్తించాలన్నారు. మితిమీరిన వేగం, నిర్లక్ష్యంగా వాహనాలు నడపకూడదని కోరారు. తద్వారా ప్రమాదాలకు తావిచ్చిన వారవుతారని తెలిపారు. విద్యాసంస్థల బస్సులకు విధించిన నిబంధనలు తప్పక పాటించాలని సూచించారు. సదస్సులో 60 మంది డ్రైవర్లు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఏఎంవీఐ ఉషాకిరణ్ తదితరులున్నారు.

చలపతి ఫార్మసీలో విద్యా వైజ్ఞానిక ప్రదర్శన ప్రారంభం



రిబ్బన్ కట్‌చేసి ప్రదర్శనను ప్రారంభిస్తున్న ఏఎన్‌యూ వీసీ ప్రొఫెసర్ కె.గంగాధర్

గుంటూరు రూరల్: ప్రపంచం యావత్ భారతదేశం వైపు చూడటానికి కారణం నాణ్యమైన పరిశోధనలేనని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ కె.గంగాధర్ తెలిపారు. నగర శివారుల్లోని లాంలోని చలపతి ఫార్మసీ కళాశాలలో కళాశాల, మోతడకలోని చలపతి ఫార్మసీ కళాశాల సంయుక్తంగా రెండు రోజులపాటు నిర్వహించనున్న 17వ ఫార్మసీ విద్యా వైజ్ఞానిక ప్రదర్శన శుక్రవారం ప్రారంభించారు. వీసీ మాట్లాడుతూ ఆరోగ్య పరిరక్షణలో ఫార్మాసిస్టుల ఎంతో అవసరమని తెలిపారు. ఎటువంటి సమయంలోనైనా సంక్షోభంలేని ఒకే ఒక రంగం ఫార్మసీ రంగమని పేర్కొన్నారు. ప్రతి విద్యార్థి గొప్ప పారిశ్రామిక వేత్తలుగా, పరిశోధకులుగా, వ్యాపారవేత్తలుగా, వివిధ రంగాల్లో స్థిరపడి దేశానికి సేవ చేయాలని కోరారు. ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ భారత దేశం ఔషధాలను ఎగుమతి చేసే స్థాయికి ఫార్మసీ రంగం అభివృద్ధి చెందినట్లు చెప్పారు. అందుకు ఉదాహరణ కోవిడ్ వ్యాక్సిన్ అని తెలిపారు. శ్రీచైతన్య విద్యాసంస్థల అసిస్టెంట్ మేనేజర్ దుర్గాప్రసాద్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి మారుతున్న సాంకేతికతకు అనుగుణంగా జీవన సరళిని మార్చుకోవాలన్నారు. గుంటూరు కెమిస్ట్ డ్రగిస్ట్ అసోసియేషన్ సెక్రటరీ కె.చంద్రశేఖర్, నెల్లూరు నారాయణ విద్యాసంస్థల డైరెక్టర్ డాక్టర్ శర్మ, చలపతి విద్యాసంస్థల అధినేత వైవీ ఆంజనేయులు, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నాదెండ్ల రామారావు మాట్లాడారు. ప్రదర్శనలో సుమారు 228 స్టాల్స్‌ను 481 మంది విద్యార్థులు ఏర్పాటు చేశారు. మొదటి రోజు 3200 మంది విద్యార్థులు వైజ్ఞానిక ప్రదర్శనలు తిలకించారు. శనివారం ఈ ప్రదర్శన కొనసాగనుంది.

ఇంజినీరింగ్ విద్యార్థులకు అవగాహన సదస్సు



మాట్లాడుతున్న సీఐ జయకుమార్

మేడికొండూరు : మండలంలోని యూనివర్సల్ ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసంపై అవగాహన సదస్సు జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మేడికొండూరు సీఐ దార్ల జయకుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో విద్య అభ్యసించాలన్నారు. లక్ష్యాన్ని ఎంచుకుని పట్టుదలతో సాధించాలని కోరారు. చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. కళాశాల సెక్రటరీ ఫాదర్ పి.బాలస్వామి మాట్లాడుతూ ప్రతి విద్యార్థి లక్ష్యం దిశగా ఇష్టంతో చదివి ముందుకు సాగాలని సూచించారు. సమస్యలు ఉంటే పరిష్కరించుకునే ప్రయత్నం చేయాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ సి.హెచ్.కేశవరెడ్డి, ఎస్సై చల్లా వాసు, ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ రమేష్, కళాశాల ఫిజికల్ డైరెక్టర్ మర్రెడ్డి, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

గేదెల చోరీ కేసులో మైనర్ సహా నలుగురి అరెస్టు

తాడికొండ: తుళ్ళూరు మండలంలో జరిగిన గేదెల దొంగతనం కేసులో ఒక మైనర్ సహా నలుగుర్ని అరెస్టు చేసినట్లు తుళ్ళూరు ఎస్ఐ వేణుగోపాల్ తెలిపారు. దర్యాప్తులో అనంతరం అమరావతి మండలం కర్లపూడి గ్రామానికి చెందిన తేలుకుట్ల గోపి, మేడా వెంకటేష్, అంగర లక్ష్మీనారాయణ, ఓ బాలుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఆయన పేర్కొన్నారు.